సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం । 12 । మే । 2023



ఉష్ణోగ్రత

నగరం	గరిష్ట	కనిష్ట:
రాజమహేంద్రవరం	41.0	28.5
కాకినాడ	36.6	27.8
అమలాపురం	38.0	27.0




రత్నగిరి.. భక్త ఝరి

వరుస సెలవులు, వివాహాల సందడి కారణంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి సత్యదేవుని ఆలయం గురువారం కిటకిటలాడింది.

II లో

మిగులు జలాలు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి గురువారం 1840 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజ్ వద్ద 10.50అడుగులకు నీటి మట్టం చేరింది.

సాగు పెట్టుబడికి భరోసా



- ఈ ఖరీఫ్‌కు సాయం అందజేతకు ఏర్పాట్లు
- వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి
- జిల్లాలో 1,32,680 మంది రైతులకు లబ్ధి
- ఏటా మూడు విడతల్లో రైతు భరోసా సాయం

కొవ్వూరు: రబీ సీజన్ ముగిసింది. అన్నదాతలు ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్నారు. ఏటా రబీ, ఖరీఫ్ సీజన్లకు ముందుగానే రైతుల పెట్టుబడికి రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా సాయం అందిస్తోంది. గడచిన నాలుగేళ్లలో రూ.584.64 కోట్లు పెట్టుబడి సాయంగా అందజేసింది. ఖరీఫ్ సీజన్ సమీపించిన నేపథ్యంలో ఈ నెలాఖరుకు ఆర్థిక సహాయం అందించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేసే పనిలో పడింది. మరోపక్క అన్నదాత కూడా వ్యవసాయ పనుల ప్రారంభానికి సమాయత్తమవుతున్నాడు. పొలం దుక్కు దున్నుకోవడం, విత్తనాలు సమకూర్చుకోవడం, నారు మళ్లు సిద్ధం చేసుకోవడం కోసం అయ్యే ఖర్చులకు ప్రభుత్వ సాయం అందుతుందని ఎదురుచూస్తున్నాడు.

పథకం అమలు ఇలా

2019 అక్టోబర్ 15 నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పీఎం కిసాన్-వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. అవసరమైన సమయంలో సాయమందిస్తూ భరోసా ఇస్తోంది. ఏటా జనవరి, సెప్టెంబర్-అక్టోబర్, మే-జూన్ నెలల్లో విడతల వారీగా ఈ పథకం కింద నిధులు విడుదల చేస్తోంది. ఏటా రైతుకు రూ.13,500 ఆర్థిక సాయం అందిస్తోంది. ఖరీఫ్ సాగుకు రైతు ఖాతాలో రూ.5,500 చొప్పున జమ చేయనున్నారు. పీఎం కిసాన్ కింద మరో రూ.2వేలు కలిస్తే రూ.7,500 వంతున జమ అయ్యే అవకాశం ఉంది.

నాలుగేళ్లలో ఆర్థికసాయం:

జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా గడచిన నాలుగేళ్లలో రూ.584.64 కోట్ల మేర రైతుల ఖాతాల్లోకి జమ అయ్యింది. ఏటా సగటున 1.31లక్షల మందికి పైగా రైతులు పెట్టుబడి సాయంగా ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారు. 2019లో మొదటి ఏడాది 1,29,182 మంది లబ్ధి పొందితే ఈ ఏడాది 1,32,680 మందికి ఆర్థిక సాయం అందనుంది. 2020-21లో అదనంగా 4,320మంది రైతు భరోసా సాయం అందించారు. గత ఏడాది కంటే ఈ సారి 1,715మందికి అదనంగా ఆర్థిక లబ్ధి చేకూరింది. ఈ నెలాఖరు లోపు లేదా జూన్ మొదటి వారంలో రైతుభరోసా సాయం అందనుంది.

ఏటా రైతులకు చేకూరుతున్న లబ్ధి మొత్తం (రూ.కోట్లలో)

సంవత్సరం	రైతుల సంఖ్య	లబ్ధి
2019-20	1,29,182	96.80
2020-21	1,33,502	180.22
2021-22	1,30,965	176.74
2022-23	1,32,680	130.87

పూర్తయిన దరఖాస్తుల పరిశీలన

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వైఎస్సార్ రైతు భరోసాకు 31,778 దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 21,997 మందిని అర్హులుగా గుర్తించారు. 9,683 మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పథకం కింద పెట్టుబడి సాయం పొందాలంటే కచ్చితంగా ప్రతీ రైతు ఈకేవైసీ చేయించుకోవాలి. సాగు భూమి కలిగిన వ్యవసాయదారు లకు భూమి విస్తీర్ణంతో సంబంధం లేకుండా సాయం అందిస్తున్నారు. కౌలు వ్యవసాయం చేసే ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ కుటుంబాలకూ ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరుతోంది. పీఎం కిసాన్ ద్వారా ఏటా మూడు విడతల్లో రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా రూ.7,500 కలిపి మొత్తం రూ.13,500 చొప్పున ఏటా రైతుకు అందజేస్తున్నారు.

మినహాయింపు ఎవరికంటే..

వివిధ పదవుల్లో ఉన్నవారిని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగులను భరోసా పథకం నుంచి మినహాయించారు. రిటైర్డై రూ.10వవేలు పైబడి పెన్షన్ పొందుతున్న వారినీ మినహాయించారు. వ్యవసాయ భూమిని నివేశన స్థలాలుగా మార్చుకున్న వారు, చేపల చెరువులు, వ్యవసాయేతర అవసరాలకు మార్చుకుని భూమి బదాలయించుకున్న వారికీ మినహాయింపు ఇచ్చారు. రెవెన్యూ, గ్రామ స్థాయిలో ఉన్న వాస్తవ రికార్డులను ఆధారం చేసుకుని అర్హతను పరిశీలిస్తున్నారు. గతేడాది అసెస్మెంట్ ఆధారంగా వ్యాపార పన్ను, వృత్తి పన్ను, జీఎస్టీ చెల్లించే వారిని(ఇన్‌కం టాక్స్ పరిధిలో ఉన్న) రైతులను మినహాయిస్తున్నారు.

కౌలు రైతులు అర్హులే..

- అన్నీ వ్యవసాయ, పండ్ల తోటలు, పట్టు ఉత్పాదక పంటలు కనీసం ఎకరంలో సాగు చేసే కౌలు రైతులు పథకం కింద అర్హులు.
- కూరగాయలు,పూలు, పశువుల మేత కోసం 0.5 ఎకరాలు, తమలపాకులైతే 0.1 ఎకరం సాగు చేస్తున్న కౌలు రైతులు కూడా అర్హులు.
- కుటుంబ సభ్యుల మధ్య జరిగే కౌలు ఒప్పందం సాయం పొందడానికి అర్హత ఉండదు.
- దేవదాయ,ఇనాం భూములు సాగు చేసుకుంటున్న కౌలు రైతులు సాయం పొందవచ్చు.
- డీ పట్టా భూములు సాగు చేసుకుంటున్న వారు..భూసేకరణలో భూములు కోల్పోయి పరిహారం పొందని వారూ అర్హులే.
- యాజమానికి ఎక్కువ మంది కౌలు రైతులుంటే ఎస్టీ వారికి ప్రాధాన్యత కల్పిస్తారు.తర్వాత ఎస్సీ,మైనారిటీలకు ప్రాధాన్యత కల్పిస్తారు.

అర్హుల జాబితాలు సిద్ధం



రైతు భరోసా పథకం కింద జిల్లాలో అర్హులైన రైతుల జాబితాలను సిద్ధం చేశాం. ఈ నెల 3వ తేదీతో దరఖాస్తుల గడువు ముగిసింది. 21,997 దరఖాస్తులు అర్హత ఉన్నట్లు గుర్తించాం. నెలాఖరుకు రైతు ఖాతాల్లో పెట్టుబడి సాయం జమయ్యే అవకాశం ఉంది.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

డబ్బులు వసూలు చేస్తున్న

మిల్లర్లపై వేటు

కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లాలో చాగల్లు మండలం బ్రాహ్మణ గూడెం, దారవరంలో రెండు మిల్లుల యాజమాన్యాలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలియడంతో ధాన్యం సేకరణ ప్రక్రియ నుంచి ఈ రెండింటినీ తొలగించినట్లు కలెక్టర్ మాధవీలత తెలిపారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయంలో కమాండ్-కంట్రోల్ నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ కాల్స్ సమాచారం ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నామన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ధాన్యం సేకరణలో పారదర్శకత.. జవాబుదారీతనంతో వ్యవహరిస్తున్నాయన్నారు. రైతుల నుంచి డబ్బులు వసూలు చెయ్యరాదని ఆమె మిల్లర్లకు మరోసారి స్పష్టం చేశారు. అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జేసీ తేజ్‌భరత్ మాట్లాడుతూ బ్రాహ్మణగూడెంలోని సూర్యదత్తా ట్రేడర్స్ నుంచి డబ్బు వసూలుపై 11, దారవరంలోని శ్రీ తేజ ఆగ్రోస్ దారవరంపై ఐదు ఫిర్యాదులు వచ్చాయన్నారు. అందువల్ల ఈ రెండు మిల్లులను ధాన్యం సేకరణను నుంచి తొలగించామన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో కూడా సేకరణకు వీరిని అనుమతించరన్నారు. వారి మిల్లింగ్ ఛార్జీలు కూడా 50 శాతం వరకు తగ్గుతాయన్నారు. ఆ మిల్లుల కస్టోడియన్ అధికారులను కూడా విధుల నుంచి సస్పెండ్ చేశామని వివరించారు.

న్యూస్‌రీల్

టేకి మృతికి సంతాపం



టేకి భౌతికదేహం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్, ఓఎస్‌డీ ఆచార్య ఎస్. టేకి (53) మృతి చెందడంతో వర్సిటీలో విషాదఛాయలు అలముకున్నాయి. గురువారం ఉదయం యూనివర్సిటీకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో గుండె పోటు రావడంతో ఆయన కుప్పకూలి కన్నుమూశారు. ఆచార్య ఎస్.టేకి మృతికి వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్‌తోపాటు ఈసీ మెంబర్స్, డీన్స్, ప్రిన్సిపాల్స్, బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలోని ఆయన స్వగృహం వద్ద భౌతిక దేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. యూనివర్సిటీ ఎఫిలియేటెడ్ కాలేజెస్ మేనేజ్మెంట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు టికె విశ్వేశ్వరరెడ్డి, అనుబంధ కళాశాలల ప్రతినిధులు, ప్రిన్సిపాల్స్ కూడా ఆచార్య టేకి భౌతిక దేహాన్ని సందర్శించి, పుష్పాంజలి ఘటించారు.

మూడో ఎఫ్ఓబీ పాక్షికంగా మూసివేత

రాజమహేంద్రవరం సిటీ : రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో కొత్త ప్లాట్‌ఫారాల నిర్మాణంలో భాగంగా 3-4 ప్లాట్‌ఫారాల మధ్య ఫుట్‌ఓవర్ బ్రిడ్జి(ఎఫ్‌ఓబి) చివరి భాగం పాక్షికంగా మూసివేసినట్లు అధికారులు తెలిపారు. తదుపరి ప్రకటన వెలువడే వరకూ తూర్పు బుకింగ్ వైపు నుంచి ప్లాట్‌ఫారమ్ చేరుకోవాలి. ఇందుకు రైల్వే స్కూల్ సమీపంలోని ఎఫ్‌ఓబీని ఉపయోగించుకోవాలన్నారు. తూర్పు బుకింగ్ కార్యాలయం తెరిచి ఉంటుందన్నారు. తూర్పు బుకింగ్ కార్యాలయం వైపు వెళ్లే ప్రయాణికుల కోసం మార్గదర్శక సూచికలు ఏర్పాటు చేశామన్నారు.

రక్తహీనత అధిగమించేందుకు ప్రణాళిక

– కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): గర్భిణులు, బాలింతల కౌమారదశలోని ఆడపిల్లలు, చిన్నారులలో ఎనీమియా, రక్తహీనత సమస్యలను అధిగమించేందుకు గట్టిగా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఇందుకోసం అంగన్వాడి కార్యకర్తల, ఆశా వర్కర్ల ద్వారా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నట్లు చెప్పారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి వెలగపూడి నుంచి వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత జిల్లా పరిస్థితులను వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో హిమోగ్లోబిన్ పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 2,255 మంది గర్భిణులకు ఈనెలలో వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. వీరిరందరికీ అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తున్నామన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ అందిస్తున్నట్లు తెలిపారు. 70 శాతం మేర గర్భిణుల వివరాలు నవీకరించామన్నారు. జగనన్న కంటి వెలుగు గురించి ప్రస్తావిస్తూ పూర్తి లక్ష్యాలను సాధించడానికి పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నాడు-నేడు పనుల పురోగతి..అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్స్, టాయిలెట్స్, జగనన్న విద్యా కానుక కిట్స్,కిచెన్, తాగునీరు తదితర అంశాలపై చర్చించారు. జిల్లాలోని పాఠశాలల్లో 274 అదనపు తరగతి గదుల పనులు జరుగుతున్నాయన్నారు. స్కూల్స్ తెరిచేనాటికి పనులు పూర్తి కావాలన్నారు. డీఆర్‌ఓ నరసింహులు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వెంకన్నకు పట్టు వస్త్రాల సమర్పణ



స్వామివారికి పట్టువస్త్రాలు అందిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: బండారులంక బిళ్ల వారి వీధిలో వేంచేసియున్న పద్మావతి అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి వారితీర్థ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రాలు సమర్పించి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా అఖండ అన్న సంతర్పణలో పదివేల మందికి అన్నదానం చేశారు. తొలుత బిళ్ల విశ్వేశ్వరరావు, లక్ష్మీ కుమారి దంపతులు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ముత్తైదువలు స్వామి,అమ్మవార్లకు సంప్రదాయబద్ధంగా సారె సమర్పించారు.

గౌతమి జీవ కారుణ్య స్థలం స్వాధీనం



స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ఎట్టకేలకు రాజమహేంద్రవరంలో గౌతమి జీవ కారుణ్య సంఘానికి సంబంధించిన మూడున్నర ఎకరాల స్థలాన్ని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. ఆశాఖ సహాయ కమిషనర్ కె.విజయలక్ష్మి గురువారం ఈ విషయాన్ని మీడియాకు వివరించారు.2014 నుంచి 2017 వరకూ 123, 124, 133/2 సర్వే నంబర్లలోని 3.5 ఎకరాల స్థలం లీజుకు దేవదాయ శాఖ గతంలో వేలం నిర్వహించింది. దాసరి నీలకంటేశ్వరరావు అనే వ్యక్తి వేలం ద్వారా లీజు దక్కించుకున్నారు. 2019లో లీజు ముగియడంతో మళ్లీ కొనసాగింపునకు హైకోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ అనంతరం స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు తాజాగా ఉత్తర్వులిచ్చింది. వాటిని అనుసరించి రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ అధికారుల సమక్షంలో దేవదాయ అధికారులు గురువారం స్థలాన్ని స్వాధీనం చేసుకుని సరిహద్దులను మూసివేశారు. ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈఓ ఆర్. శ్రీనివాస్, నాళం వారి సత్రం ఈఓ ఆర్‌వీ చందన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ఈఓ ఆర్.లక్ష్మిబాయి, వేణుగోపాల స్వామి వారి దేవస్థానం రాజమహేంద్రవరం ఈఓ ఆర్.రమణమ్మ, వీరవరం గ్రూప్ టెంపుల్స్ ఈఓ బీవీ సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలం తీరితే తుక్కుకే..

- 15 ఏళ్లు దాటిన ప్రభుత్వ వాహనాలకు నో రెన్యువల్
- కచ్చితంగా ఆర్‌టీవోకు తెలిపి స్క్రాప్‌నకు పంపాలి
- ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి నిబంధనలు



రాయవరం: పదిహేను సంవత్సరాలు పైబడిన ప్రభుత్వ వాహనాలకు ఇక కాలం చెల్లినట్లే. ఇప్పటి వరకు 15 ఏళ్ల తర్వాత కూడా రెన్యువల్ చేయించుకుని వినియోగిస్తున్న ఎన్నో వాహనాలకు ఇకపై స్క్రాప్‌కు చేరనున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా పాత వాహనాలు తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒక వాహనం కొనుగోలు చేస్తే..దాని కాల పరిమితి 15 సంవత్సరాలు ఉంటుంది. ఇప్పటి వరకు 15 ఏళ్ల తర్వాత కూడా తిరిగి ఐదు సంవత్సరాల వంతున వాహన కండిషన్‌ను బట్టి రెన్యువల్ చేసుకునే సదుపాయం ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వ వాహనాలకు సంబంధించి ఆ అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. పదిహేనేళ్లు దాటిన ప్రభుత్వ వాహనాలు స్క్రాప్‌నకు పంపాలని జనవరి 16న ఆదేశాలు జారీ చేయగా, ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకుని వచ్చింది. స్క్రాప్‌నకు పంపే ముందుకు కచ్చితంగా ఆర్టీవో అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా 15 ఏళ్లు దాటిన వాహనాల జాబితా కోసం ఆర్టీవో శాఖ అధికారులు దృష్టి సారించారు

లెక్కలు తీసేపని మొదలు

జిల్లాల పునర్విభజన నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి 15 ఏళ్లు దాటినవి ఎంత సంఖ్యలో ఉంటాయన్నది జిల్లా రవాణాశాఖ లెక్కలు తీసే పనిలో ఉంది. దాదాపుగా 50 నుంచి 100 వరకు ఉండే అవకాశం ఉందని ఆర్టీవో అధికారులు భావిస్తున్నారు. ఏప్రిల్‌కు ముందు రెన్యువల్ చేసినా..కాలం తీరిన వాహనాలు తీసేయాల్సిందే. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్ మాత్రం రెన్యువల్‌కు సంబంధించి అప్‌డేట్స్‌ను కూడా నిలిపివేసింది. ముఖ్యంగా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలతో పాటు పలు శాఖల్లో కాలం తీరిన వాహనాలు ఉన్నట్లు ప్రాథమిక అంచనాకు అధికారులు వచ్చారు.

దృష్టి సారించిన రవాణా శాఖ

కాలం తీరిన వాహనాలు తీసేసే ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఆర్టీవో అధికారులు దృష్టి సారిస్తున్నారు. దానిలో భాగంగా జిల్లా కలెక్టర్ చైర్మన్ హోదాలో ఇతర శాఖల ముఖ్య అధికారులు ఉన్న జిల్లా రహదారి భద్రతా కమిటీ ద్వారా ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. పూర్తి స్థాయిలో అన్ని శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులకు లేఖలు రాశారు.

సందళ్లె సందళ్లే... పెళ్లిళ్ల సందళ్లే..

- 12, 13, 14వ తేదీలలో భారీ ముహూర్తాలు
- కలిసి వచ్చిన రెండో శనివారం.. ఆదివారం
- ఉద్యోగులు సెలవులకు అనుకూలంగా నిర్వహణ
- వేలాది వివాహాలకు సిద్ధమైన మంటపాలు
- అన్నింటికీ పెరిగిన డిమాండ్



అన్నవరం దేవస్థానంలో కల్యాణ మంటపాలు



కోనసీమ జిల్లా అంబాజీపేటలోని కొబ్బరి తోటలో వివాహ విందుకు ఏర్పాట్లు

సాక్షి అమలాపురం: పెళ్లిళ్ల సీజన్‌లో బలమైన ముహూర్తాలకు తోడు దూరప్రాంతాల నుంచి వచ్చేవారికి అనువుగా వారాంతం, వేసవి సెలవులు కూడా రావడంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పెళ్లి బాజా బలంగా మోగుతోంది. ‘వీకెండ్’లో ముహూర్తాలు రావడంతో ఈ మూడు రోజులు వేలాదిగా పెళ్లిళ్లు జరుగుతున్నాయి. ఈ నెల 12న శుక్రవారం, 13న శనివారం, 14 ఆదివారం వరుసగా ముహూర్తాలు రావడంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వీకెండ్‌లో పెళ్లిళ్లు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. 12వ తేదీన రాత్రి 7.29 గంటలకు, అర్ధరాత్రి 2 గంటలు (తెల్లవారితే శనివారం) బలమైన ముహూర్తాలు ఉన్నాయి. ఈ నెల 3 నుంచి 14వ తేదీ వరకు, తిరిగి 21 నుంచి జూన్ 6వ తేదీ వరకు ముహూర్తాలు ఉన్నాయి. ఆ తరువాత ఆషాఢ మాసం మొదలు కానుంది. ఈ కారణంగా ఈ ముహూర్తాలకే ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. సెలవులు కలసి వచ్చేలా ఉన్న ముహూర్తాలకే వివాహకర్తలు జై కొడుతుండడం చూసి కొందరు వేదపండితులు ‘ఇవి వీకెండ్ ముహూర్తాలు’ అని తమాషా చేస్తుండడం విశేషం. రెండు రోజుల పాటు కలిసి వచ్చే సెలవుల కారణంగా చాలా వరకు అవే బలమైన మూహూర్తాలుగా మారాయి.

జూన్ 18 నుంచి జూలై 17 వరకు ఆషాడ మాసం. జూలై 18 నుంచి ఆగస్టు 16 వరకు అధిక శ్రావణ మాసం. ఈ సమయంలో పెళ్లిళ్లు చేసే అవకాశం లేదు. ఆషాడ మాసం, అధిక మాసం కారణం వల్ల కూడా ఇప్పుడు ఎక్కువగా వివాహాలు జరుగుతున్నాయి. వీటికితోడు వరుస సెలవులు వస్తుండడంతో కొందరు, దూర ప్రాంతాల్లో ఉన్న బంధువులు, మిత్రులు పెళ్లికి వచ్చేందుకు వీలుగా ఉండడంతో ఈ ముహూర్తాలకే చాలామంది మొగ్గు చూపారు. దీనికితోడు వేసవి సెలవులు కావడం వల్ల కూడా చాలామంది ఈ ముహూర్తాలను ఎంచుకున్నారు. రెండు, మూడు నెలల క్రితం పెళ్లి కుదిరినవారు సైతం మధ్యలో ముహూర్తాలు వచ్చినా ఈ మూడు రోజులు ముహూర్తాలకే అధికంగా మొగ్గు చూపారు. ఈ కారణంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో భారీగా పెళ్లిళ్లు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ మూడు రోజుల్లో సుమారు 10 వేల వరకు పెళ్లిళ్లు జరుగుతాయని అంచనా.

కిటకిటలాడుతున్న ఆలయాలు

ఉమ్మడి జిల్లాలో వివాహాలు అధికంగా జరిగే ఆలయాల్లో పెళ్లిళ్లు అంచనాలకు మించి జరగనున్నాయి. ప్రసిద్ధి పుణ్యక్షేత్రం అన్నవరంలో ఈ మూడు రోజులు పెళ్లిళ్లు సుమారు 500 వరకు జరగనున్నాయి. ఇదే సమయంలో ఇతర ప్రాంతాల్లో పెళ్లిళ్లు చేసుకుని వ్రతాలకు వచ్చేవారి సంఖ్య వేలల్లో ఉండనుంది. అందుకు తగినట్టుగా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అమలాపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ మూడు రోజులు సుమారు 90 పెళ్లిళ్లు జరగనున్నాయి. వీటితోపాటు కాకినాడ జిల్లా పిఠాపురంలోని కుంతీ మాధవస్వామి, కోనసీమ జిల్లాలో మురమళ్ల వీరేశ్వరస్వామి, అప్పనపల్లి బాలబాలాజీ, మలికిపురం వేంకటేశ్వరస్వామి, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం శ్రీ సత్యనారాయణస్వామి, గోకవరం మండలం తంటికొండ వేంకటేశ్వర స్వామి, కోరుకొండ లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానాల్లో పెళ్లిళ్ల సందడి అధికంగా ఉంది. ఈ సందడిలో కడియం పూల మార్కెట్‌లో బంతి, చేమంతి, గులాబీ, మల్లి, ఆర్నమెంట్ పువ్వుల ధరలు మూడు, నాలుగు రెట్లు పెరిగాయి.

ధరలకు రెక్కలు

అధిక పెళ్లిళ్ల నేపథ్యంలో పెళ్లి క్రతువులో భాగం ఉండే ప్రతి ఒక్కరికీ, ప్రతి వస్తువుకు డిమాండ్ పెరిగింది. కల్యాణ మంటపాలు ఖాళీ లేవు. ఎండల వల్ల ఏసీ కల్యాణ మంటపాల అద్దెలకు రెక్కలొచ్చాయి. సాధారణ రోజులు కన్నా 30 శాతం ధరలు పెంచారు. అద్దె ఏసీలు తెచ్చి చిన్న చిన్న కల్యాణ మండపాలను కూడా ఈ నెల రోజులు ఏసీ కల్యాణ మంటపాలుగా మార్చేశారు. ఈ అవకాశం లేని వారు ఖాళీ స్థలాలు, కొబ్బరి తోటలను వివాహాలు నిర్వహించేందుకు అనువుగా ముస్తాబు చేస్తున్నారు.

వీకెండ్ ఎఫెక్టే వల్లే అధికంగా..



ఈ నెల 12 నుంచి 14 వరకు ఈ మూడు రోజులు భారీగా పెళ్లిళ్లు ఉన్నాయి. శుక్ర, రెండో శనివారం, ఆదివారం కావడంతో ఎక్కువ మంది ఈ ముహూర్తాలకే మొగ్గు చూపుతున్నారు. ఈ మూడు రోజుల్లో పెద్దగా బలం లేని ముహూర్తాలలో సైతం పెళ్లిళ్లు జరుగుతున్నాయి. ఈ నెల 21 నుంచి జూన్ 6వ తేదీ వరకు ముహూర్తాలు ఉన్నా దూరపు ప్రాంతాల్లో ఉన్న బంధుమిత్రుల వీకెండ్ ముహూర్తాలకే పెళ్లికర్తలు మొగ్గు చూపారు.

– ఉపద్రష్ట నాగ ఆదిత్య, వేద పండితుడు, పంచాంగ కర్త, అమలాపురం, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా

నన్నయ ఓఎస్‌డి ఆచార్య టేకి ఆకస్మిక మృతి


ఆచార్య టేకి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ మేనేజ్ ప్రొఫెసర్, ఓఎస్‌డీ ఆచార్య ఎస్.టేకి (53) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. రాజమహేంద్రవరంలోని సీటీఆర్ఐ వద్ద భాస్కరనగర్‌లో నివాసం ఉంటున్న ఆయన ఎప్పటిలాగే ఉదయాన్నే షటిల్ ఆడి వచ్చారు. తర్వాత యూనివర్సిటీకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. ఆస్పత్రికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయింది. టేకి హఠాన్మరణం యూనివర్సిటీ వర్గాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. యూనివర్సిటీలో అధ్యాపకునిగా, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, రిజిస్ట్రార్‌గా, ఓఎస్‌డీగా వివిధ పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. 1993లో భారతీయ విద్యాభవన్ (జల్గావ్)లో, 1995 ఉత్తర మహారాష్ట్ర యూనివర్సిటీ (జల్గావ్)లో లెక్చరర్‌గా బోధన వృత్తిని చేపట్టారు. 1998లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెస్టు మేనేజ్మెంట్ భోపాల్‌లో రీసెర్చ్ అసోసియేట్, 2007లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ (ఫరీదాబాద్)లో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు. 2009 నుంచి ఆదికవి నన్నయ యూనివర్సిటీలో పని చేస్తున్నారు. టేకి మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామమైన మండపేటకు తరలించారు. అక్కడ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. భార్య, కుమార్తె దగ్గరలోనే ఉన్నాగాని, బిటెక్ చదువుతున్న కుమారుడు ఇంటర్న్‌షిప్ కారణంగా మహారాష్ట్రలో ఉండటంతో చూస్తున్నారు.

రత్నగిరి.. భక్త ఝరి

- వరుస సెలవులతో వేలాదిగా తరలివచ్చిన జనం, నవ దంపతులు
- గురువారం సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- రెండు వేల వ్రతాల నిర్వహణ, రూ.40 లక్షల ఆదాయం


సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు, నవ దంపతులు

అన్నవరం: వరుస సెలవులు, వివాహాల సందడి కారణంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి సత్యదేవుని ఆలయం గురువారం కిటకిటలాడింది. దీనికితోడు సుమారు రెండు నెలల విరామం అనంతరం మళ్లీ వివాహాల సందడి మొదలవడంతో నవదంపతులు, పెళ్లి బృందాలతో స్వామివారి ఆలయం, ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద సంఖ్యలో భక్తులు రత్నగిరికి తరలివచ్చారు. దీంతో స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూ లు, వ్రత మంటపాలు, అన్నీ భక్తులతో నిండిపోయాయి. బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున రత్నగిరిపై సుమారు వంద వివాహాలు జరిగాయి. ఇతర ప్రాంతాలలో కూడా అదే ముహూర్తానికి పెద్ద సంఖ్యలో వివాహాలు జరగడంతో తమ బంధువులతో కలసి నవ దంపతులు సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు.

సత్యదేవుని దర్శించిన 40 వేల మంది భక్తులు

సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 2,500 జరిగాయి. స్వామివారి దర్శనానికి రెండు గంటలు, రూ.200 టిక్కెట్‌తో అంతరాలయ దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు.


సత్యదేవుని వ్రతాలాచరించడానికి మంటపం వద్ద వేచి ఉన్న భక్తులు


రత్నగిరిపై గురువారం తెల్లవారుజామున పెళ్లి సందడి

మూడు రోజులు కొనసాగనున్న రద్దీ

శుక్ర, శని, ఆదివారాల మూడు రోజులు పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగే అవకాశం ఉండడంతో రత్నగిరిపై రద్దీ కొనసాగనుంది. మూడు రోజులు సుమారు 500 వివాహాలు జరిగే అవకాశం ఉందని పండితులు తెలిపారు. భక్తుల రద్దీ తట్టుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో హోటల్ దగ్ధం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని మాలపల్లి తూము వద్ద అగ్ని ప్రమాదంలో హోటల్ దగ్ధం అయిందని అనపర్తి అగ్నిమాపక దళం అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన అని వ్యక్తి దేవరపల్లి సత్యనారాయణ హోటల్ నడుపుతూ అక్కడే నివాసం ఉంటున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ఈ ప్రమాదం జరిగిందన్నారు. దీంతో హోటల్ సామగ్రి అంతా కాలిపోయిందన్నారు. సుమారు రూ.లక్షన్నర వరకు ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు. సర్పంచ్ బుంగా రామారావు, ఉపసర్పంచ్ నల్లమిల్లి వెంకటరెడ్డి బాధితులకు అండగా ఉంటామని తెలిపారు.


బలభద్రపురంలో మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

అవమానం భరించలేక ఆత్మహత్య

- సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న సెల్ఫీ వీడియో
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

సామర్లకోట: ఒక మహిళ చేతిలో జరిగిన అవమానాన్ని భరించలేక టిఫిన్ సెంటర్ యజమాని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇది. మేడిశెట్టి గోపాలకృష్ణ (45) తన సెల్‌ఫోన్ సెల్ఫీ వీడియోలో చనిపోవడానికి కారణాలను చెప్పుతూ మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి పరిస్థితిని గమనించి అతని కుమార్తె బాలాత్రిపుర కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతూ గురువారం ఉదయం ఆస్పత్రిలో మృతి చెందాడు. దాంతో గోపాలకృష్ణ సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆ వీడియో ప్రకారం సామర్లకోట మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో పోలింగ్ రింగ్ సెంటర్ వద్ద టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న సమయంలో సుమారు ఏడేళ్ల క్రితం హోటల్‌లో పని చేయడానికి వచ్చిన ఏసమ్మ అనే స్థానిక మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. అప్పటి నుంచి ఆమెను పోషిస్తున్నాడు. ఇటీవల ఏసమ్మ తన పుట్టింటికి వెళ్లి పోవడంతో కారణం తెలుసుకోవడానికి వెళ్లిన సమయంలో ఏసమ్మ అక్క బుజ్జమ్మ, నానమ్మ శేషారత్నం బహిరంగంగా చెప్పుతో కొట్టారు. ఆ సంఘటనను భరించలేక చనిపోతున్నానని వీడియోలో చెప్పాడు. ఏసమ్మ కోసం ఎంతో సొమ్ము ఖర్చు చేశానని వీడియోలో పేర్కొన్నాడు. ఈ మేరకు తన కుటుంబానికి జరిగిన అన్యాయంపై న్యాయం చేయాలని ఇటువంటి సంఘటన మరొకరికి జరుగకుండా చూడాలని మృతుని కుమార్తె బాలాత్రిపుర విజ్ఞప్తి చేసింది. కాగా తండ్రికి కుమార్తె బాలాత్రిపుర తలకొరివి పెట్టింది. ఆమె ఫిర్యాదు మేరకు సీఐ కె.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో వీడియో క్లిపింగ్‌ను కూడా ఆధారంగా చేసుకొంటామని సీఐ తెలిపారు.


మేడిశెట్టి గోపాలకృష్ణ (ఆత్మహత్య చేసుకునే ముందు ఫొటో)

అర్ధరాత్రి యువకుడి హత్య

- మేడపై నిద్రిస్తుండగా కత్తిపీట, కర్రతో దాడి చేసిన యువతి, యువకుడు
- ప్రేమ వ్యవహారమే కారణమని భావిస్తున్న పోలీసులు
- గోకవరం మండలం తిరుమలాయపాలెంలో ఘటన


మృతుడు ఒమ్మి నాగశేషు (ఫైల్)

గోకవరం: ఇద్దరు యువతీ యువకుల మధ్య నడిచిన ప్రేమ వ్యవహారం చివరకు యువకుడి హత్యకు దారితీసింది. అర్ధరాత్రి సమయంలో మరో యువకుడితో కలిసిన యువతి మేడపై నిద్రిస్తున్న యువకుడిపై కత్తిపీట, కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి హతమార్చింది. గోకవరంలో సంచలనం రేకెత్తించిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఒమ్మి నాగేషు (25) తాపీ పని చేసుకుని జీవిస్తున్నాడు. అతనికి ఏడాది క్రితం గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన అరుణతో వివాహమైంది. బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలానికి చెందిన కుర్లు డిబేరా అనే యువతి, రాజవొమ్మంగి మండలానికి చెందిన శివన్నారాయణ అనే యువకుడితో కలిసి నాగేషు ఇంటికి వచ్చి మేడపై నిద్రిస్తున్న అతనిపై వెంట తెచ్చుకున్న కర్ర, కత్తిపీటతో తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న నాగేషు కేకలు విన్న తల్లి గంగ, స్థానికులు 108కు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిని అతన్ని తొలుత గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో రంపచోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. హతుడు నాగేషుకి, డిబేరాకి సుమారు ఏడేళ్ల నుంచి ప్రేమ వ్యవహారం నడుస్తోందని, ఈ క్రమంలో అతనికి డిబేరా రూ.2 లక్షలు నగదు, బంగారు గొలుసు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఆ నగదు తిరిగి ఇవ్వాలని డిబేరా కొంత కాలంగా నాగేషుని డిమాండ్ చేస్తోంది. డబ్బు, బంగారం తిరిగి ఇవ్వకపోవడంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న కోరుకొండ సీఐ వై.ఉమామహేశ్వరరావు, గోకవరం ఎస్సై యూవీ శివనాగబాబు ఘటన జరిగిన ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు ఆ ప్రాంతాన్ని పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ముద్దాయిలను అదుపులోకి తీసుకుని వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర అలజడి రేకెత్తించింది. అర్ధరాత్రి సమయంలో ఇటువంటి ఘటన జరగడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.


తిరుమలాయపాలెంలో మేడపై హత్య జరిగిన ప్రదేశం


స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు

రాజశ్యామల యాగంలో భక్తులు పాల్గొనాలి

అన్నవరం: ఈ నెల 12వ తేదీ నుంచి విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తోన్న అష్టోత్తర (108) శత కుండాత్మక చండీరుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞంలో భక్తులందరూ పాల్గొనాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన అన్నవరం దేవస్థానంలో నిర్వహించిన యాగం సన్నాహక కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి, పాడిపంటలు సమృద్ధి కోసం యాగాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ యాగంలో భాగంగా ఈ నెల 14వ తేదీన విజయవాడలో శ్రీ సత్యదేవుని శాంతి కల్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు. శాంతికల్యాణాన్ని తిలకించేందుకు అన్నవరం పరిసర ప్రాంతాల నుంచి తరలి వెళ్లే భక్తుల కోసం బస్సు సదుపాయం, విజయవాడలో వసతులు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. స్వామివారి శాంతి కల్యాణం అనంతరం భక్తులకు 50 గ్రాముల సత్యదేవుని ప్రసాదం, తలంబ్రాలు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు, దేవస్థానం అధికారులు, సర్పంచ్ కుమార్ రాజా పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

పుష్కర్ ఘాట్ వద్ద మెప్మా బజార్‌ను ప్రారంభించిన ఎంపీ భరత్‌రామ్


మెప్మా బజార్‌ను తిలకిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. గురువారం నగరంలోని పుష్కర్ ఘాట్ వద్ద మెప్మా బజార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కొనుగోలుదారులను ఆకట్టుకునేలా వస్తువుల తయారీ ఉండాలన్నారు. ప్రజలకు ఏది అవసరమో తెలుసుకోని తయారు చేసి మార్కెట్ లో ప్రదర్శిస్తే తప్పక ఫలితం ఉంటుందని మహిళలకు సూచించారు. మెప్మా బజార్ జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అటుపై జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా మీ వస్తువుల తయారీలో నైపుణ్యత చూపాలని అన్నారు. మీ వ్యాపార రంగ అభివృద్ధికి ప్రభుత్వపరంగా కావాల్సిన సహకారం ఎప్పుడూ ఉంటుందని ఎంపీ భరత్ చెప్పారు. అన్ని స్టాల్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు ఆడపా శ్రీహరి, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, నగర యువజన అధ్యక్షురాలు పీత రామకృష్ణ, మింది నాగేంద్ర, యిన్నమూరి ప్రదీప్, కాలే చిన్ని, అరిగెల బాబు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలకు ట్రస్టుబోర్డుల నియామకం


పుట్టా శ్రీకౌమారి రామశర్మ, చందాసత్రం చైర్మన్


ఇన్నమూరి ప్రదీప్, మార్కండేశ్వరస్వామి వారి దేవస్థానం


దుంగామంగాలక్ష్మి, సత్యనారాయణస్వామివారి దేవస్థానం


బర్రేకొండబాబు, గౌతమి జీవకారుణ్య సంఘం చైర్మన్


చవ్వాకుల సుబ్రహ్మ ణ్యం,సారంగధరేశ్వర స్వామివారి దేవస్థానం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం నగరంలో దేవదాయ శాఖ నిర్వహణలో ఉన్న పలు దేవాలయాలకు పాలకమండలి కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్టు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. ఆయా ఆలయాల ట్రస్టు బోర్డు చైర్మన్లు, కమిటీ సభ్యుల పేర్లను మీడియాకు వెల్లడించారు. శ్రీ మార్కండేశ్వర స్వామి దేవస్థానానికి ట్రస్టు బోర్డు చైర్మన్‌గా ఇన్నమూరి ప్రదీప్, శ్రీ సత్యనారాయణ స్వామి వారి దేవస్థానానికి చైర్మన్‌గా దుంగా మంగాలక్ష్మి, గౌతమి జీవకారుణ్య సంఘ చైర్మన్‌గా బర్రే కొండబాబు, చందా సత్రానికి పుట్టా శ్రీ కౌమారి రామశర్మ, సరంగదరేశ్వర స్వామి వారి దేవస్థానానికి చవ్వాకుల సుబ్రహ్మణ్యం చైర్మన్లుగా నియమితులయ్యారని ఎంపీ భరత్ తెలిపారు.

పిడుగుపడి యువకుడి మృతి


మృతుడు శ్రీనివాస్ (ఫొటో)

సామర్లకోట/కిర్లంపూడి: సామర్లకోట పట్టణం గణపతినగరం 29వ వార్డుకు చెందిన ప్రకృతి శ్రీనివాస్(22) పిడుగుపడి మృతి చెందిన ఘటన గురువారం మండల పరిధి రాజుపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడు కుటుంబీకులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. శ్రీనివాస్ హైదరాబాదులో సివిల్స్‌కు సిద్ధమవుతున్నాడు.

ఈ నెల 3వ తేదీన తన సోదరుడి పెళ్లికోసం సామర్లకోట వచ్చాడు. గురువారం తన స్నేహితులతో కలిసి కిర్లంపూడి మండలం రాజుపాలెం పరిధి ముక్కొల్లు రెగ్యులేటర్ వద్దకు స్నానం చేయడానికి వచ్చాడు. సాయంత్రం 4 గంటల సమయంలో వాతావారణంలో ఒక్కసారిగా మార్పులు సంభవించి ఉరుములతో కూడిన వర్షం రావడంతో అందరూ చెట్టు కిందకు చేరుకున్నారు. విద్యుత్ షాక్ తగిలినట్లు తన స్నేహితులకు అనిపించి అక్కడి నుంచి వేరే చోటుకు పెరిగెత్తారు. అప్పడికే శ్రీనివాస్ పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. తన స్నేహితులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి తల్లిదండ్రులు, సోదరుడు, సోదరి ఉన్నారు.

గుండెపోటుతో ఏఎస్ఐ సాయిబాబు మృతి


ఏఎస్ఐ సాయిబాబు (ఫైల్)

సఖినేటిపల్లి: స్థానిక పీఎస్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న సాయిబాబు (55)గురువారం గుండెపోటుతో ఆయన స్వగ్రామం కొత్తపేటలో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ఆయన మృతి పట్ల ఎస్సై ఎస్.రాము తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కాగా సఖినేటిపల్లి పీఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా సుమారు ఐదు సంవత్సరాల క్రితం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం మలికిపురం పీఎస్‌లో కూడా ఆరు నెలలు పనిచేసి, సుమారు మూడు సంవత్సరాల క్రితం పదోన్నతిపై తిరిగి సఖినేటిపల్లి ఏఎస్ఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. పీఎస్ పరిధిలోని ఓ కేసు నిమిత్తం ఆయన ఏపీ హైకోర్టుకు వెళ్లి గత రాత్రికి కొత్తపేటకు చేరుకున్నారు. తెల్లవారుజామున వచ్చిన గుండెపోటుతో మృతి చెందారు.

క్వారీలో జారిపడిన ట్రాక్టర్ : డ్రైవర్ మృతి


తాతారావు మృతదేహం

కొవ్వూరు: దేచెర్ల రెవెన్యూ పరిధిలో ఉన్న అర్లమ్మ క్వారీలో ట్రాక్టర్ బోల్తా పడిన దుర్ఘటనలో దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామానికి చెందిన కొండల తాతరావు (47) గురువారం మృతి చెందారు. క్వారీలో రాళ్ల డ్రిల్లింగ్ చేసేందుకు కొండపై తాతారావు ట్రాక్టర్ ని సక్రమంగా పెడుతున్న తరుణంలో అకస్మాత్తుగా జారి క్వారీలో పడింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న తాతా రావు ఘటనా స్థలంలోనే మృతి చెందారని రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. మృతుడు తాతరావు ఓనర్ కం డ్రైవర్‌గా ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయకుకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. క్వారీ ఆకుల ప్రకాష్‌కి చెందినదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

ఇద్దరు యువకుల అరెస్టు


నిందితులను అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు

తుని: రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసి రిమాండుకు విజయవాడ రైల్వేస్టేషన్‌కు తరలించామని జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్‌మారూఫ్ తెలిపారు. వివరాల్లోకెళితే.. రైల్వే రాజమహేంద్రవరం డీఎస్పీ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు కాకినాడ లైన్స్ ఇనస్పెక్టర్ ఆధ్వర్యంలో తుని జీఆర్పీ ఎస్సై అబ్దుల్‌మారూఫ్ క్రైం టీంను ఏర్పాటు చేశారు. తుని, అన్నవరం, సామర్లకోట, కాకినాడ రైల్వేస్టేషన్లలో, రైళ్లలో నేరాలకు పాల్పడుతున్న నరేంద్ర, స్వామి అనే యువకులను ఈ టీం సభ్యులు అదుపులోకి తీసుకున్నారు. కాకినాడకు చెందిన వీరిద్దరి నుంచి రెండు పుస్తెలతాళ్లు, చైను(50 గ్రాములు) స్వాధీనం చేసుకున్నారు. స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్‌మారూఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హెచ్‌సీ శ్రీనివాస్, కానిస్టేబుల్ ప్రసాద్, ఏఎస్ఐ గోవిందరాజు, క్రైంబ్రాంచ్ ఏఎస్ఐ సత్యన్నారాయణ పాల్గొన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జాతీయ న్యాయసేవాధికార సంస్థ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత గురువారం తెలిపారు. ఫిజికల్, హైబ్రిడ్ విధానంలో లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల ప్రాంతాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు రాజీ పడ్డదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామానికి చెందిన కడియాల దుర్గ సాయి కుమార్(26) మృతి చెందినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బలభద్రపురం గ్రామానికి చెందిన కడియాల దుర్గ సాయి కుమార్ కరెంట్ పని చేస్తూ జీవించేవాడు.

అయితే రెండేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో అతని చెయ్యి తొలగించడంతో దివ్యాంగులు పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్నాడు. చేయి బాధ ఎక్కువగా వస్తోందని, అందువల్ల ఈ నెల 8 తేదీన ఆత్మహత్య చేసుకుందామని పురుగుల మందు తాగడంతో బంధువులు వెంటనే అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

వరకట్నం కేసు నమోదు

అయినవిల్లి: అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్న భర్త పై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్. నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామానికి చెందిన ప్రసాది వరలక్ష్మికి, అనకాపల్లి గ్రామానికి చెందిన లోవరాజుతో 2009లో వివాహం అయింది. ఆ సమయంలో వరలక్ష్మి తల్లిదండ్రులు రూ.2లక్షలు కట్నం ముట్టజెప్పారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే ఇది భర్త లోవరాజు తనకు అదనపు కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడన్నారు. ఈ నెల 8 తేదీన వీరి మధ్య గొడవ జరిగింది. బాధితురాలు వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం

ఐ.పోలవరం: మురమళ్ల వృద్ధ గౌతమీ గోదావరిలో గురువారం గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40 సంవత్సరాల వయసు గల మహిళ మృతదేహం రాఘవేంద్ర వారధి సమీప గోదావరిలో ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. దీనితో ఎస్సై ఎస్.రాజేష్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని మృతదేహం మహిళది అని తెలిసిన వారు ఎవరైనా ఉంటే స్థానిక పోలీసు స్టేషన్‌కు వచ్చి వివరాలు తెలపాలని ఆయన కోరారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

ముమ్మిడివరం: నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 370 బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.సురేష్‌బాబు తెలిపారు. ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి శివారు నల్లావారిపేటలో బండారు నాగరాజు, సుంకర రామకృష్ణ యానాం నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం తెచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆకస్మికంగా దాడి చేయడంతో ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

సాక్షి
స్పోర్ట్స్
శుక్రవారం
12-5-2023



ఫైనల్లో బెర్త్ కోసం బరిలో భారత బాక్సర్లు

ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నేడు ముగ్గురు భారత బాక్సర్లు కీలకపోరుకు సిద్ధమయ్యారు. తెలంగాణకు చెందిన హుసాముద్దీన్ (57 కేజీలు), హరియాణాకు చెందిన దీపక్ భోరియా (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) సెమీఫైనల్ బౌట్‌లలో పోటీపడనున్నారు. 2022 యూరోపియన్ చాంపియన్ బిలాలా బెనామా (ఫ్రాన్స్)తో దీపక్; సైడెల్ హోర్టా (క్యూబా)తో హుసాముద్దీన్; 2022 ఆసియా చాంపియన్ అస్లాన్‌బెక్ షింబెర్గెనోవ్ (కజకిస్తాన్)తో నిశాంత్ దేవ్ తలపడతారు. సెమీఫైనల్లో గెలిస్తే ఫైనల్ చేరి స్వర్ణ–రజత పతకాల బరిలో ఉంటారు. ఓడితే కాంస్య పతకాన్ని గెల్చుకుంటారు. భారత కాలమానం ప్రకారం నేడు సాయంత్రం గం. 5:30కు దీపక్ బౌట్ ఉంది. ఆ తర్వాత హుసాముద్దీన్, నిశాంత్ దేవ్ బౌట్‌లు జరుగుతాయి. ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ఈ బౌట్‌లను ప్రత్యక్షంగా తిలకించవచ్చు. ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో ఇప్పటి వరకు భారత్ నుంచి ఒక్కరే ఫైనల్‌కు అర్హత సాధించారు. 2019లో అమిత్ పంఘాల్ (52 కేజీలు) ఫైనల్లో ఓడిపోయి రజత పతకం గెల్చుకున్నాడు.

సరబ్‌జోత్–దివ్య జోడీకి స్వర్ణం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీ

బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం లభించింది. గురువారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సరబ్‌జోత్ సింగ్–దివ్య థడిగోల్ సుబ్బరాజు (భారత్) ద్వయం విజేతగా నిలిచింది. స్వర్ణ–రజత పతక ఫైనల్ పోరులో సరబ్‌జోత్–దివ్య జోడీ 16–14తో జొరానా అరునోవిచ్–దామిర్ మికెచ్ (సెర్బియా) ద్వయంపై విజయం సాధించింది. సరబ్‌జోత్ కెరీర్‌లో ఇది రెండో ప్రపంచకప్ స్వర్ణంకాగా... బెంగళూరుకు చెందిన దివ్యకు ప్రపంచకప్ టోర్నీలలో తొలి పతకం కావడం విశేషం. మొత్తం 55 జోడీలు పాల్గొన్న క్వాలిఫయింగ్‌లో సరబ్‌జోత్–దివ్య ద్వయం 581 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచి స్వర్ణ–రజత పతక మ్యాచ్‌కు అర్హత సాధించింది. భారత్‌కే చెందిన ఇషా సింగ్–వరుణ్ తోమర్ జంట 578 పాయింట్లు స్కోరు చేసి ఆరో ర్యాంక్‌లో నిలిచి పతక మ్యాచ్‌లకు అర్హత పొందడంలో విఫలమైంది. టాప్–4లో నిలిచిన జోడీలు పతక మ్యాచ్‌లకు అర్హత సాధిస్తాయి. ఈ టోర్నీలో భారత్ ఒక స్వర్ణం, ఒక కాంస్యంతో రెండు పతకాలతో రెండో స్థానంలో ఉంది.



‘బ్లాక్‌డే’ పాటించిన రెజ్లర్లు

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన రెజ్లర్ల నిరసన జంతర్ మంతర్ వద్ద కొనసాగుతోంది. నిరసనకు 18వ రోజైన గురువారం రెజ్లర్లు ‘బ్లాక్‌డే’గా పాటించారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ వీరంతా నల్ల బ్యాండ్‌లు ధరించి తమ అసంతృప్తిని ప్రదర్శించారు. ‘ఈ రోజు మేం బ్లాక్‌డే పాటించాం. దేశం మొత్తం మాకు అండగా నిలుస్తోంది కాబట్టి విజయం సాధిస్తామని నమ్ముతున్నాం. న్యాయం దక్కే వరకు మా నిరసన కొనసాగుతుంది’ అని బజరంగ్, సాక్షి మలిక్, వినేశ్ ఫొగాట్ అన్నారు.



శ్రీకాంత్‌కు విదేశీ కోచ్



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని భారత బ్యాడ్మింటన్ స్టార్ కిడాంబి శ్రీకాంత్ వ్యక్తిగత విదేశీ కోచ్‌ను నియమించుకున్నాడు. ఇండోనేసియాకు చెందిన వీంపి నహార్ది ఇక నుంచి శ్రీకాంత్‌కు శిక్షణ ఇస్తాడు. 2021 డిసెంబర్‌లో భారత సింగిల్స్ ప్లేయర్లకు విదేశీ కోచ్‌గా ఉన్న అగుస్ ద్వి సాంతోసో తిరిగి వెళ్లిపోయాక భారత సింగిల్స్ ప్లేయర్లకు విదేశీ కోచ్ లేకుండా పోయాడు. కోచ్ కావాలని భారత స్పోర్ట్స్ అథారిటీకి గత జనవరిలో ప్రతిపాదన పంపించినా ఎలాంటి చర్యలు లేకపోవడం... ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీలు మొదలుకావడంతో తానే కోచ్‌ను నియమించుకున్నానని శ్రీకాంత్ తెలిపాడు.


భారత్‌కు క్లిష్టమైన ‘డ్రా’

దోహా: ఏషియన్ కప్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టుకు కఠినమైన ‘డ్రా’ ఎదురైంది. వచ్చే ఏడాది జనవరిలో ఖతర్ వేదికగా ఈ మెగా టోర్నీ జరగనుంది. గ్రూప్ ‘బి’లో ఆస్ట్రేలియా (ప్రపంచ 29వ ర్యాంక్), ఉజ్బెకిస్తాన్ (74వ ర్యాంక్), సిరియా (90వ ర్యాంక్) జట్లతో కలిసి భారత్ (101వ ర్యాంక్) ఉంది. వచ్చే ఏడాది జనవరి 12 నుంచి ఫిబ్రవరి 10 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం 24 జట్లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. 67 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ టోర్నీలో భారత జట్టు 1964లో రన్నరప్‌గా నిలిచింది. ఆ తర్వాత భారత్ 1984లో, 2011లో, 2019లో ఈ టోర్నీకి అర్హత సాధించినా గ్రూప్ దశలోనే నిష్క్రమించింది.

జై జైస్వాల్...

47 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్స్‌లతో 98 నాటౌట్

- 9 వికెట్లతో రాజస్తాన్ ఘన విజయం
- ఈడెన్‌లో కోల్‌కతా చిత్తు
- చహల్‌కు 4 వికెట్లు


చహల్




యశస్వి జైస్వాల్

తొలి ఓవర్లో 6, 6, 4, 4, 2, 4... ఇలా దూకుడు మొదలు పెట్టిన యశస్వి జైస్వాల్ ఆగలేదు... తొలి 6 బంతుల్లో 26 పరుగులు రాబట్టిన అతను తర్వాతి 7 బంతుల్లో మరో 24 పరుగులు కొట్టేశాడు. అంతే...13 బంతుల్లో ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీతో కొత్త రికార్డు సృష్టించాడు. 3 ఓవర్లలోపే యశస్వి హాఫ్ సెంచరీ అయిపోయింది. మరో 3 ఓవర్లు ముగిసేసరికి జట్టు స్కోరు 78 పరుగులు. అక్కడే మ్యాచ్‌లో ఎవరు గెలవబోతున్నారో అర్థమైపోయింది! ఇక మిగిలింది యశస్వి ఎంత దూరం, ఎలా వెళతాడనేది... సెంచరీ వరకు చేరగలిగాడు కానీ రెండు పరుగుల తేడాతో శతకం చేజారింది. అయితేనేం ఐపీఎల్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటి ఆడిన జైస్వాల్ రాజస్తాన్ జట్టును గెలిపించాడు... మరో ఎండ్‌లో కెప్టెన్ సామ్సన్ మెరుపు బ్యాటింగ్‌తో పని సులువైంది. రాజస్తాన్ 41 బంతులు మిగిలి ఉండగానే నైట్‌రైడర్స్‌ను చిత్తు చేసింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	11	8	3	0	16	0.951
చెన్నై	12	7	4	1	15	0.493
రాజస్తాన్	12	6	6	0	12	0.633
ముంబై	11	6	5	0	12	-0.255
లక్నో	11	5	5	1	11	0.294
బెంగళూరు	11	5	6	0	10	-0.345
కోల్‌కతా	12	5	7	0	10	-0.357
పంజాబ్	11	5	6	0	10	-0.441
హైదరాబాద్	10	4	6	0	8	-0.472
ఢిల్లీ	11	4	7	0	8	-0.605

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ముంబై × గుజరాత్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో రాజస్తాన్ పండగ చేసుకుంది. నైట్‌రైడర్స్ బ్యాటింగ్ చేసినంత సేపూ నెమ్మదిగా అనిపించిన పిచ్‌పైనే పరుగులు వరద పారించి కీలక విజయాన్ని అందుకుంది. గురువారం జరిగిన పోరులో రాజస్తాన్ 9 వికెట్ల తేడాతో కోల్‌కతాపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (42 బంతుల్లో 57; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. యజువేంద్ర చహల్ 25 పరుగులకు 4 వికెట్లు పడగొట్టి కోల్‌కతాను కట్టడి చేశాడు. అనంతరం రాజస్తాన్ 13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 151 పరుగులు చేసి గెలిచింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ యశస్వి జైస్వాల్ (47 బంతుల్లో 98 నాటౌట్; 12 ఫోర్లు, 5 సిక్స్‌లు), సంజూ సామ్సన్ (29 బంతుల్లో 48 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగి జట్టును లక్ష్యానికి చేర్చారు.

వెంకటేశ్ అయ్యర్ బ్యాటింగ్‌ను మినహాయిస్తే కోల్‌కతా ఇన్నింగ్స్ ఆసాంతం పేలవంగా సాగింది. వెంకటేశ్ కూడా మరీ విధ్వంసకరంగా ఆడకపోయినా... పరిస్థితిని బట్టి తనవంతు పాత్ర పోషించాడు. వెంకటేశ్ 42 బంతుల్లో 57 పరుగులు చేయగా ... ఇతర ఆటగాళ్లంతా కలిసి 78 బంతుల్లో 89 పరుగులు చేయగలిగారంటే అతని ఇన్నింగ్స్ విలువ తెలుస్తుంది.

ధనాధన్...

ఆశ్చర్యకరంగా పార్ట్‌టైమ్ బౌలర్, కోల్‌కతా కెప్టెన్ నితీశ్ రాణా మొదటి ఓవర్ వేశాడు. ఆ ఓవర్లో ఏకంగా 26 పరుగులు రాబట్టి ప్రత్యర్థిని యశస్వి కఠినంగా శిక్షించాడు. సమన్వయ లోపంతో జోస్ బట్లర్ (0) రనౌట్ కావడంతో రాయల్స్ తొలి వికెట్ కోల్పోయింది. అయితే జట్టుపై అది ఎలాంటి ప్రభావం చూపించలేదు. యశస్వి, సామ్సన్ కలిసి వేగం తగ్గకుండా ఇన్నింగ్స్‌ను నడిపించారు. వీరి షాట్లకు నైట్‌రైడర్స్ బౌలర్ల వద్ద సమాధానం లేకపోయింది. సామ్సన్ 16 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన క్యాచ్‌ను నేలపాలైంది. అనంతరం అనుకూల్ వేసిన ఓవర్లో 3 సిక్సర్లతో సామ్సన్ చెలరేగాడు. చివర్లో యశస్వి సెంచరీ విషయంలో కాస్త ఉత్కంఠ నెలకొంది. యశస్వి 94 పరుగుల వద్ద ఉండగా రాయల్స్‌కు 3 పరుగులు కావాలి. 13వ ఓవర్ చివరి బంతికి పరుగు తీయని సామ్సన్ సిక్సర్ కొట్టమన్నట్లుగా సైగ చేస్తూ యశస్వికి అవకాశం ఇచ్చాడు. అయితే తర్వాతి బంతికి ఫోర్ మాత్రమే రావడంతో యశస్వి 98 పరుగుల వద్ద ఆగిపోవాల్సి వచ్చింది. అయితే దానిని పట్టించుకోకుండా అతను విజయానందాన్ని ప్రదర్శించాడు.

1 ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా అర్ధ సెంచరీ చేసిన క్రికెటర్‌గా యశస్వి (13 బంతుల్లో) నిలిచాడు. గతంలో ఈ రికార్డు కేఎల్ రాహుల్, కమిన్స్ (14 బంతుల్లో) పేరిట ఉంది.

187 ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా చహల్ రికార్డు నెలకొల్పాడు. డ్వేన్ బ్రేవో (161 మ్యాచ్‌ల్లో 183 వికెట్లు) పేరిట ఉన్న రికార్డును చహల్ (143 బంతుల్లో 187 వికెట్లు) సవరించాడు.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: జేసన్ రాయ్ (సి) హెట్‌మైర్ (బి) బౌల్ట్ 10; గుర్బాజ్ (సి) సందీప్ శర్మ (బి) బౌల్ట్ 18; వెంకటేశ్ (సి) బౌల్ట్ (బి) చహల్ 57; నితీశ్ రాణా (సి) హెట్‌మైర్ (బి) చహల్ 22; రసెల్ (సి) అశ్విన్ (బి) ఆసిఫ్ 10; రింకూ సింగ్ (సి) రూట్ (బి) చహల్ 16; శార్దుల్ (ఎల్బీ) (బి) చహల్ 1; అనుకూల్ (నాటౌట్) 6; నరైన్ (సి) రూట్ (బి) సందీప్ 6; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 149. వికెట్ల పతనం:** 1-14, 2-29, 3-77, 4-107, 5-127, 6-129, 7-140, 8-149. **బౌలింగ్:** బౌల్ట్ 3-0-15-2, సందీప్ శర్మ 4-0-34-1, అశ్విన్ 4-0-32-0, రూట్ 2-0-14-0, యజువేంద్ర చహల్ 4-0-25-4, ఆసిఫ్ 3-0-27-1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (నాటౌట్) 98; బట్లర్ (రనౌట్) 0; సామ్సన్ (నాటౌట్) 48; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి) 151. వికెట్ల పతనం:** 1-30. **బౌలింగ్:** నితీశ్ రాణా 1-0-26-0, హర్షిత్ రాణా 2-0-22-0, శార్దుల్ ఠాకూర్ 1.1-0-18-0, వరుణ్ చక్రవర్తి 3-0-28-0, సునీల్ నరైన్ 2-0-13-0, సుయశ్ 3-0-22-0, అనుకూల్ 1-0-20-0.

సినిమా



“ఓ నటుడుగా నన్ను నేనెప్పుడూ విమర్శించుకుంటూనే ఉంటాను... అభినందించుకోను. ఎప్పటికప్పుడు తప్పులు వెతుకుతూనే ఉంటాను.. నటుడిగా నన్ను నేను మెరుగుపరచుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నాను" అని అన్నారు నాగచైతన్య. వెంకట్ ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం 'కస్టడీ'. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో నాగచైతన్య చెప్పిన విశేషాలు.

ఆ విషయం ఓ సవాల్‌గా మారింది

\- నాగచైతన్య

- తమిళ చిత్రం ‘మానాడు’ విడుదల కాకముందే వెంకట్ ప్రభుగారు నాకు ‘కస్టడీ’ స్టోరీ చెప్పారు. అయితే ‘మానాడు’ విడుదలై, హిట్ సాధించిన తర్వాత, ఈ సినిమానే మేం తెలుగులో రీమేక్ చేస్తే బాగుంటుందన్నట్లుగా కొందరు నిర్మాతలు అభిప్రాయపడ్డారు. కానీ ‘కస్టడీ’ స్టోరీ నన్ను ఎగ్జయిట్ చేసింది. పైగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ కొంతవరకు పూర్తయింది. దీంతో ‘కస్టడీ’ని సెట్స్‌పైకి తీసుకెళ్లాం. ఈ సినిమాలో భాగంగా కొందరు పోలీసులను కలిశాను. వారి కథలు నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి.
- ఈ సినిమాలో నేను పోలీస్ కానిస్టేబుల్ శివ పాత్ర చేశాను. నా కెరీర్‌లో ఎప్పుడూ చేయనటువంటి కొన్ని కొత్త యాక్షన్ సీక్వెన్స్‌లను ఈ సినిమా కోసం చేశాం. కథ రీత్యా ఈ తరహా యాక్షన్ సీక్వెన్స్‌లు అవసరం అయ్యాయి. అయితే కొన్ని యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం కొంత రిహార్సల్స్ చేశాం. ఈ సినిమాలోని వాటర్ సీక్వెన్స్ కోసం మూడు రోజులు రిహార్సల్స్ చేసి, దాదాపు 15 రోజులు షూట్ చేశాం. ఈ ఎపిసోడ్ ఓ హైలైట్‌గా ఉంటుంది.
- సినిమా మొదలైన తొలి ఇరవై నిమిషాలు కూల్‌గా ఉంటుంది. ఎప్పుడైతే స్క్రీన్‌పైకి అరవింద్ స్వామిగారు వస్తారో అప్పట్నుంచి స్టోరీ మలుపు తీసుకుని ఆడియన్స్‌ను స్క్రీన్‌పై నుంచి చూపు తిప్పుకోనివ్వకుండా చేస్తుంది. ఈ చిత్రంలో శరత్ కుమార్, అరవింద్ స్వామి, ప్రియమణి వంటి సీనియర్స్ నటించారు. వారి నుంచి నేను కొన్ని విషయాలు నేర్చుకున్నాను. ఇచ్చిన డైలాగ్స్‌ను తనదైన స్టైల్లో ఇంప్రూవ్ చేసి చెబుతుంటారు అరవింద్ స్వామి గారు. ఇది నాకు చాలా కొత్తగా అనిపించింది. వెంకట్‌గారు ఏ స్క్రిప్ట్ అయితే నాకు చెప్పారో అదే తీశారు. ఆయన స్క్రీన్‌ప్లే స్టయిల్ తెలుగు ప్రేక్షకులకు కొత్తగా ఉంటుంది. ఈ చిత్రంలో కమర్షియల్ ఎలిమెంట్స్ స్టోరీకి తగ్గట్లుగానే ఉంటాయి. ఫ్యామిలీ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. అవుట్‌పుట్ పట్ల చాలా నమ్మకంతో ఉన్నాను. పోలీస్ బ్యాక్‌డ్రాప్ సినిమాల్లో నాకు ‘ఘర్షణ’, నాన్నగారి ‘శివమణి’, ‘జేమ్స్ బాండ్’ యాక్షన్ ఫ్రాంచైజీ చిత్రాలు ఇష్టం.
- నిర్మాత శ్రీనివాసా చిట్టూరిగారు సెట్స్‌లో కూల్‌గా ఉంటారు. ‘కస్టడీ’ నా కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో నిర్మించబడింది. ఈ సినిమా 1990 బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. ఇళయరాజాగారు, యువన్ శంకర్‌రాజాగార్లు ఇచ్చిన మ్యూజిక్ ‘కస్టడీ’కి ప్లస్. ‘కస్టడీ’ని వేరే సినిమాతో పోల్చవద్దు. ‘కస్టడీ’ చిత్రం ‘కస్టడీ’యే.
- నేను తెలుగు డబ్బింగ్ కోసం దాదాపు పది రోజులు తీసుకుంటాను. కానీ తమిళ ‘కస్టడీ’ సినిమాకు డబ్బింగ్ పూర్తి చేయడానికి నెలరోజుల టైమ్ పట్టింది. నా సొంత వాయిస్ అయితే ఆడియన్స్‌కు యాక్టర్‌గా చేరువ కావొచ్చు. మన పెర్ఫార్మెన్స్ కూడా మెరుగ్గా కనిపిస్తుంది. అందుకే తమిళంలో డబ్బింగ్ చెప్పాను.
- నేను ఫలానా రకమైన సినిమాలు చేస్తేనే ఆడియన్స్‌కు నచ్చుతాయని అదే ట్రాక్‌లోకి వెళితే ఓ యాక్టర్‌గా అది నా బలహీనత అవుతుంది. ఈ విషయంలో నన్ను నేను కన్విన్స్ చేసుకోలేను. గతంలో నేను చేసిన కొన్ని లవ్‌స్టోరీలు వర్కౌట్ అయ్యాయి. అలా అని అవే సినిమాలు చేస్తుంటే ఓ యాక్టర్‌గా ఎదగలేను. చైతన్య ఎలాంటి సబ్జెక్ట్ అయినా బాగా చేస్తాడని ఆడియన్స్‌తో అనిపించుకోవాలి.
- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేక్షకులకు ఏ రకమైన సినిమాలు నచ్చుతున్నాయో తెలుసుకోవడం చాలెంజ్‌లా మారింది. కానీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా ఇస్తే వారి ఆదరణ ఓ రేంజ్‌లో ఉంటుంది.
- నా తర్వాతి ప్రాజెక్ట్ గురించి త్వరలో అధికారికంగా చెబుతాను. ‘ధూత’ వెబ్ సిరీస్ రిలీజ్ అమెజాన్ చేతిలో ఉంది. ఈ ఏడాదే స్ట్రీమింగ్ స్టార్ట్ కావొచ్చు.

మా తాతగారు, నాన్నగారు గొప్ప గొప్ప సినిమాలు చేశారు. కొన్ని స్టాండర్డ్స్ క్రియేట్ చేశారు. కొందరు వారితో మాకు పోలికలు పెడుతుంటారు. అయితే ఈ విషయాన్ని నేను ఓ ప్రెజర్‌లా తీసుకోను. చాలెంజ్‌లా స్వీకరించి, నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాను. ఆ స్థాయికి నేను రీచ్ అవుతానా? లేదా అనేది నాకు తెలియదు. కానీ నా శక్తివంచన లేకుండా కష్టపడుతూనే ఉంటాను.


నా గురించిన కొన్ని వార్తలు వస్తూనే ఉన్నాయి (విడాకుల అంశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ..). డిఫరెంట్ వార్తలు రాస్తున్నారు. కానీ ఆడియన్స్ ఫూల్స్ కాదు. తెలివైనవారు. ఏది జెన్యూన్ న్యూస్.. ఏది కాదనేది వారికి తెలుసని అనుకుంటున్నాను. నేను అయితే నవ్వుకుని వదిలేస్తున్నాను.

గేమ్ స్టార్ట్

‘ది కేరళ స్టోరీ’ వంటి వివాదాత్మక సినిమా తర్వాత హీరోయిన్ అదా శర్మ ఓ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ‘హేట్ స్టోరీ 2’ ఫేమ్ విశాల్ పాండ్య దర్శకత్వంలో శ్రేయాస్ తల్పాడే హీరోగా నటిస్తున్న చిత్రం ‘ది గేమ్ ఆఫ్ గిర్గిట్’. ఈ చిత్రంలో అదా శర్మ నటిస్తున్నట్లు చిత్రయూనిట్ గురువారం ప్రకటించింది. ఇటీవల కాలంలో యువతలో బాగా ప్రాచుర్యం పొందిన ‘బ్లూ వేల్ గేమ్’ (బ్లూ వేల్ ఛాలెంజ్) నేపథ్యంలో థ్రిల్లర్‌గా ఈ కథ సాగుతుంది. ఇందులో అదా శర్మ పోలీస్ పాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ– ‘‘గతంలో ‘కమాండో’ సినిమాలో భావనా రెడ్డి అనే పోలీస్ పాత్ర చేశాను. ఆ పాత్ర మంచి ప్రజాదరణ పొందింది. ఇప్పుడు ‘ది గేమ్ ఆఫ్ గిర్గిట్’లో గాయత్రీ భార్గవ్ అనే పోలీస్ పాత్ర చేస్తున్నాను. నా పాత్ర సరదాగా, విభిన్నంగా ఉంటుంది’’ అన్నారు.


● అదాశర్మ

ఓ సరదా ప్రయాణం


● నాగశౌర్య

నాగశౌర్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘రంగబలి’. ఈ చిత్రం ద్వారా పవన్ బాసంశెట్టి దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఎస్‌ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ‘రంగబలి’ని జూలై 7న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. నాగశౌర్య ట్రెండీ గెటప్‌లో కనిపిస్తున్న ఓ పోస్టర్ ద్వారా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ‘‘పల్లెటూరి నేపథ్యంలో సాగే కథతో ‘రంగబలి’ ఫన్ రైడ్ (సరదా ప్రయాణం) గా ఉండబోతోంది. ఇందులో నాగశౌర్య విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు.. ఇందుకు ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. హీరోయిన్, ఇతర వివరాలను త్వరలోనే తెలియజేస్తాం’’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: పవన్ సీహెచ్, కెమెరా: దివాకర్ మణి.

ప్రపంచంలో జరుగుతున్నదే మళ్ళీ పెళ్లిలో చూపిస్తున్నాం


\- వీకే నరేశ్

‘‘ఓ మనిషి చావు చివరి దశలో ఉన్నప్పుడు చేయాల్సిన పనులు ఏవైనా మిగిలి ఉన్నాయా? ఏమైనా ప్రదేశాలను చూడాలనుకుని చూడలేక పోయామా? మనవల్ల ఎవరికైనా అన్యాయం జరిగిందా? అనే మూడు అంశాల గురించి ఓసారి ఆలోచిస్తాడు. కానీ ఏ మనిషి జీవితంలో అయినా ఈ మూడు ఆశలు తీరనవిగా ఉండకూడదు. ఇదే ‘మళ్ళీ పెళ్లి’ సినిమా బేసిక్ కాన్సెప్ట్’’ అన్నారు నటుడు వీకే నరేశ్. ఎమ్మెస్. రాజు దర్శకత్వంలో వీకే నరేశ్, పవిత్రా లోకేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘మళ్ళీ పెళ్లి’. విజయకృష్ణా మూవీస్ పతాకంపై వీకే నరేశ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో విజయకృష్ణా మూవీస్ లోగోను వీకే నరేశ్, పవిత్రాలు రీ లాంచ్ చేశారు. ఎమ్మెస్ రాజు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వీకే నరేశ్ మాట్లాడుతూ– ‘‘ప్రపంచంలో జరుగుతున్న అంశాలనే ఈ చిత్రంలో బోల్డ్‌గా చూపించాం. ఇది నా జీవితానికి సంబంధించిన సబ్జెక్ట్ కాదు’’ అని అన్నారు. ‘‘సినిమాలో ఉన్నట్లే జీవితంలో కూడా ఫస్టాఫ్, సెకండాఫ్ ఉంటాయి. ఎవరైనా సెకండాఫ్ చాలా బాగుండాలని కోరుకుంటారు.. అదే ‘మళ్ళీ పెళ్లి’ కాన్సెప్ట్. ఆడియన్స్‌ను చీట్ చేయడం లేదు. తప్పుని తప్పుగానే చూపిస్తున్నాం.’’ అన్నారు ఎమ్మెస్ రాజు. ‘‘ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు ఎమ్మెస్ రాజుగారి నుంచి చాలా నేర్చుకున్నాను’’ అన్నారు పవిత్రా లోకేశ్. ఈ కార్యక్రమంలో సంగీతదర్శకులు సురేష్ బొబ్బిలి, అరుల్‌దేవ్, ఎడిటర్ జునైద్ తదితరులు పాల్గొన్నారు.


● నరేశ్, పవిత్రా లోకేశ్, ఎమ్మెస్ రాజు

హ్యాపీ ఎండింగ్

యశ్ పూరి, అపూర్వ రావు జంటగా నటించిన చిత్రం ‘హ్యాపీ ఎండింగ్’. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో హామ్స్ టెక్ ఫిల్మ్స్, సిల్లీ మాంక్స్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ‘‘అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఈ సినిమా ఉంటుంది’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. అజయ్ ఘోష్, విష్ణు ఓయ్, ఝాన్సీ, అనిత చౌదరి, హర్ష రోషన్, జియా శర్మ నటించిన ఈ సినిమాకు సంగీతం: రవి నిడమర్తి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ రామానుజం.


● యశ్ పూరి

వాస్తవ ఘటనతో...

ఇషాన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘అంతం కాదిది ఆరంభం’. శక్తి మహేంద్రా, నిష్మా, ప్రణాళి హీరోయిన్స్. ప్రభు పాల్‌రాజ్, సిరాజ్ నిర్మించారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ని డైరెక్టర్ దశరథ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ‘‘తమిళనాడులోని పొల్లాచ్చిలో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమా తీశారు. తమని ట్రాప్ చేసి, నగ్న వీడియోలు తీసి వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసిన వ్యక్తిని బాధిత అమ్మాయిలు ఎలా పట్టుకున్నారు? అనేదే ఈ చిత్రకథ’’ అన్నారు. సిరాజ్ మాట్లాడుతూ– ‘‘ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వాస్తవ ఘటనలతో ఇషాన్ ఈ చిత్రాన్ని చక్కగా తెరకెక్కించాడు’’ అన్నారు. సంగీత దర్శకుడు వినోద్ యాజమాన్య, రచయిత రాంబాబు గోసాల, షేర్ స్టూడియో అధినేత దేవీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: టి. శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కర్రి మోహన్.


● నిష్మా, ఇషాన్, శక్తి

హీరో ఆఫ్ ఇండియా!

కిషోర్ తేజ, అంకిత మూలేర్ జంటగా ఆకుల రాఘవ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘హీరో ఆఫ్ ఇండియా’. తుమ్మలపల్లి రామసత్య నారాయణ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను తెలంగాణ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్ లాంచ్ చేశారు. జె. భానుప్రసాద్ స్వరపరచిన మొదటి పాటని తెలుగు ఫిలిం చాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి, రెండో పాటని నిర్మాత సాయి వెంకట్ లాంచ్ చేశారు. ‘‘తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, అమెరికాలోనూ మా సినిమాను రిలీజ్ చేస్తున్నందుకు హ్యాపీ’’ అన్నారు తుమ్మలపల్లి రామసత్యనారాయణ.


● అంకిత, కిషోర్